# "బి-యు-టి"

"నా పేరు బి-యు-టి 'బట్' కాదు. బి-హెచ్-ఎ-టి, "భట్" అని నవ్వాడు అతడు."

అదే మొదటిసారి అతడు నాతో మాట్లాడడం.

అసలేమయిందంటే-

మా ఆవిడ పాపాయిని తీసుకుని హైదరాబాద్ వెళ్ళింది. ఈలోగా కుటుంబంతో సహా ఢిల్లీలోకి ఒక మిత్రుడు దిగబడితే, వాళ్ళకు మావాటా నప్పగించవలసి వచ్చింది. తత్ఫలితంగా నేను నాజీవితంలో మొదటిసారిగా ఒక హోటల్లో బసచేయవలసి వచ్చింది. అదొక చిత్రమయిన అనుభవం.

హోటల్లో రెండవ అంతస్తుమీద ఆగదిలో నేనుగాక వెంకటాచలం అని ఒక మద్రాసతనుండేవాడు. అతడొక దినపత్రికలో పనిచేసేవాడు. చిత్రలేఖనం అతడి హాబీ. మా ఇద్దరి వేవ్ లెంగ్త్లూ, చాలవరకు కలిసేవి. పికాసోనుండి స్వామి నాథన్ దాక అతడు చెబుతే బెర్నార్డుషా నుండి బెండపూడిహనుమాయమ్మ దాక నేను విమర్శలు చేస్తుండేవాడిని. ఇద్దరమూ కలిసి చిత్ర ప్రదర్శనలకు, చర్చలకు, గోష్ఠులకు వెళ్ళుతుండేవాళ్ళం.

మాకు భోజనాలు హోటల్ కింది అంతస్తులో హాల్ లో పెట్టేవారు. భోజనాల దగ్గర ఇతరగదుల వాళ్ళు తటస్థపడుతుండేవారు.

ఉన్నట్లుండి ఒకనాడు పొద్దున ఒక కొత్తతన్ని చూశాను. ఆదేరాత్రి, మళ్ళీ మరుసటిరోజూ వరుసగా అతడు నాకంటపడ్డాడు. అతడు అంతలా నా దృష్టిలోకి రావడానికి ఒక నెగెటివ్ కారణం వుంది.

ఆ భోజనాల హాల్ లో సహజమైన వెలుతురు తక్కువగా వుండేది. పగలు కూడా నియాన్ లైట్ల వెలుగుండడంతో వాతావరణం కృత్రిమంగా వుండేది. హాలు ఒక పక్కగా గాజు పలకల బీరువా వుండేది. దానిలోపల మామేత పదార్థాలుండేవి.

అబీరువా వెనకాల వంటగది.... నాలుగు చెక్క కాళ్ళ మీద ఒక చట్రం. ఆ చట్రంలో ఇమిడ్చిన రాతిపలక– ఇది టేబిలంటే... అలాటివి ఇరవై వుండేవి. ఒకడు భోజనం చేసి లేవగానే క్లీనర్ వచ్చి కంచం తీసేసి–యుగయుగాల సంచితమయిన మురికికి ఏకైక ప్రతినిధివంటి ఒక తడిగుడ్డతో తుడిచేవాడు. టేబిలు చూడడానికి 'క్లీన్'గా వుండేదే గాని.... అదో విధమయిన 'నీచు' వాసన వేస్తుండేది. సర్వర్ ఆ బీరువాలోనుండి గిన్నెలను మోసుకొచ్చి ఆ టేబిల్ మీద అమర్చిన స్టెయిన్లెస్ స్టీల్ కంచంలో వడ్డించేవాడు. తెలుగు కథల్లా 'స్టేల్'గా వుండే ఆ తిండి గొంతులోకి దిగేదికాదు. అయినా ఆత్మా దేహమూ కలిసి వుండాలికదా అని ఏదో ఇంత గతకకుండా తప్పేది కాదు. అందులో అనుభవించడానికి ఆనందించడానికి ఏమాత్రం అస్కారంలేదు. గబగబ నాలుగు ముద్దలు మింగి బయిటపడితే చీకట్లో చేయరాని పనేదో చేసి వెలుతురులోకి వచ్చినట్లుండేది. ఎంతటి సుదీర్ఘకాల హోటల్ వాసికయినా ఆ వాతావరణంలోకి రసించి మరీ భోజనం చేయడం అన్నది. అసాధ్యం, దురూహ్యం.

అలాటి వాతావరణంలో–

ఆ హోటల్ లో–

ఈ కొత్త వ్యక్తి–

ఆ భయంకరమైన నీలం రంగు పూసివున్న కుర్చీమీద ఒక కాలు మడుచుకుని, అర్ధ పద్మాసనం లాటిది వేసుకొని.

తడి తడిగా, జిగట జిగటగా, కంపు కంపుగా వున్న ఆ టేబిల్ మీద ఎడమ చేతిని హాయిగా పూర్తిగా ఆనించి–

ఆ కూర–కూటు–సాంబార్రసాలను పదే పదే అడిగి వేయించుకుంటూ – పరమానందంగా ఆస్వాదిస్తూ– తింటూ– మారు వేయించుకుంటూ–అదయ్యాక ఇంకొకసారి వడ్డించమని తింటూ–అందరికన్న రెండు మూడింతల భోజనం చేస్తూ, ఆ కార్యంలో ఏదో అనిర్వచనీయమయిన అనుభూతీ, ఆనందం తగలడ్డట్లు తన్మయత్వంలో వుండే –

ఆ కొత్త వ్యక్తిని గమనించకుండా ఎలా వుండడం?

గమనించక అసహ్యించుకోకుండా ఎలా వుండడం?

అతనంటే వెగటు పుట్టింది.

ఆ హోటల్ టేబిల్ అంటే నా ముక్కు కులాగే, అతడంటే నా మనసుకూ రోతనిపించింది.

ఈ దుర్గంధపు వాతావరణంలో, ఈ ఛండాలపు తిండిని–తినడమే ఒక శాపంగా పరిగణించవలసిన దానిని– వరప్రసాదంవలె భుజిస్తున్న ఈదేబెగాడు ఎవడబ్బా అనిపించి,– 'ఛీ....ఎవడయితే మనకేమి' అనుకున్నాను.

ఒక వారం తర్వాత, సాయంకాలం ఇంటికి వస్తుంటే దారిలో వెంకటాచలం కలిశాడు. నేను వచ్చి దిగిన బస్సులోనే తానూ వచ్చాట్ట. ఇద్దరమూ కలిసి నడుస్తున్నాం. పంజాబీ స్త్రీలూ, మల్లెపూలూ, ఢిల్లీ ఎండలూ, పుట్టింటికి వెళ్ళిన

పెళ్ళాలూ, వంట విషయాలు చర్చిస్తూ నడుస్తున్నాము, ఉన్నట్లుండి వెంకటాచలం అడిగాడు.

"రావ్! మన హోటల్లోకి ఒక కొత్తతడు వచ్చాడు. చూశావా?"

అతడట్లా అడగ్గానే నాకు గుర్తుకు వచ్చింది-ఆ తిండిపోతే ! అతడిని వర్ణించి "అతడేనా ?" అని అడిగాను.

"ఔను."

'అతనంటే నాకు రోతపుడుతున్నది.' అని ఆరోతకు తల్లితండ్రులెవరో, వారి గోత్రాలేమిటో వివరించాను.

అన్నీ విన్నాక వెంకటాచలం అన్నాడు. "పొరబడుతున్నావు రావ్! అతడు చాల ఇంటరెస్టింగ్ వ్యక్తి. నువ్వు తప్పకుండా తెలుసుకోవలసిన వాడు.-"

నాకు ఆశ్చర్యం వేసింది. వెంకటాచలం జడ్జిమెంట్ మీద నమ్మకం లేకపోతే ఆక్షణాన్నే అతడి మాటను తోసిపారేసి వుండే వాడిని.

ఆ రాత్రి-

భోజనాల దగ్గర 'అతడు' కన్పించలేదు.

ఆ మరు రాత్రి నేనో మిత్రుడింట్లో భోజనంచేసి వచ్చాను. హోటలుచేరి బట్టలు మార్చుకుంటున్నాను. వెంకటాచలం ఆరోజే వాళ్ళావిడ దగ్గరనుండి వచ్చిన వుత్తరం గురించి చెబుతున్నాడు. ఈలోగా 'అతడు' మాగదిలోకి వచ్చాడు.

"హల్లో మిస్టర్ వెంకటాచలం-" అంటూ పలకరించాడు.

వెంకటాచలం నన్ను చూపిస్తూ- "మిస్టర్ రావు.... వారపత్రికలో పనిచే స్తున్నారు....." అని పరిచయం చేస్తుండగానే అతడు చిరునవ్వు మొహంతో నన్ను సమీపించాడు. కరచాలనంచేస్తూ- "నా పేరు బి-యు-టి 'బట్' కాదు, బి-హెచ్-ఎ-టి, 'భట్' అని నవ్వాడు."

చాల చవకబారు హాస్యపు ప్రియుడల్లే వున్నాడనుకున్నాను. ఏవో మాటలతో ఓ గంట గడిపాము.

మూడు రోజుల తర్వాత రాత్రి భోజనం తర్వాత నేను డాబా మీద పచారుచే స్తుండగా భట్ వచ్చాడు.

కాసేపు పిచ్చాపాటీ అయ్యాక వున్నట్లుండి- "రావ్‌గారూ! నా ఇంగ్లీషు ఇంప్రూవ్ అవాలంటే ఏయే పుస్తకాలు చదవాలో చెప్పండి-" అన్నాడు.

అతడి మొహంలోకి చూశాను.

"అలా చూస్తారేమిటి?- నేను పట్టభద్రుడిని కాదుకదా మెట్రిక్ కూడా పాస వలేదు. ఎనిమిదో తరగతి చదువుతుండగా ఇల్లు విడిచి నీలగిరీస్‌కు పారిపోయాను. అక్కడ టీ ఎస్టేట్ దొరల దగ్గర పని చేశాను. ఏంపనంటారా.... అన్నీను... ఇల్లుచిమ్మడం, డ్రింకులు అందివ్వడం, బూట్లు పాలిష్ చేయడం, కార్లుతుడవడం, పిల్లల్ని ఎత్తుకోవడం అన్ని పనులూ చేసేవాడిని....తిండీ బట్టా, దొరికేవి.... దాంతోబాటు ఇంగ్లీషూ అలవడింది....."

'అదన్నమాట, ఇతగాడి ఇంగ్లీషు సో తప్పులున్నా కొంత విలక్షణంగా వుండడానికి కారణం–' అనుకున్నాను.

"ఏవైన్ ఎంత వింటేజ్‌దో చెప్పగల విచక్షణ ఏర్పడింది... పన్నెండేళ్ళ పాటు ఆ మోటారుకార్ల ఊపిరితిత్తులు – జీర్ణకోశాలు చూచి, తుడిచి, వాటిని విప్పడంలో, కలిపి కూర్చడంలో సాయంచేసిన ఫలితంగా కారు మెకానిజం క్షుణ్ణంగా అవగతమయింది. కారు భాగాలను దేనికదిగా విడదీసి కుప్పపోసి, మళ్ళీ ఆ కుప్పనుండి కారుని తయారు చేయగలను. ఆ జ్ఞానమే నాకీనాడు, కార్ల విడిభాగాల సేల్సుమన్‌గా నెలకో వెయ్యిరూపాయలు అర్జించి పెడుతూంది... ఈ వెయ్యి రూపాయల్లో రెండువందలు మా నాన్నకు పంపుతాను. ఓ వంద మాతమ్ముడి పేరిట బ్యాంక్‌లో వేస్తున్నాను. వాడిగుండెలో ఏదో కాంప్లికేషనుంది. దానికి వేలూర్లో ఆపరేషన్ చేస్తారుట. కాని నాలుగు వేలుకావాలి. ఇప్పటికి రెండు వేల పైచిలుకు చేర్చాను. ఆ నాలుగు వేలూచేర్చి వాడికి ఆపరేషన్ చేయించాలి. మా చెల్లి మెట్రిక్ చదువుతూంది. దానికి పెళ్ళి చేయాలి." అని ఏవేవో చెప్పాడు భట్టు.

కాస్సేపు నిశ్శబ్దం.... ఆకాశంలో నక్షత్రాలు మినుకు మినుకు మంటూ పలకరించుకుంటున్నాయి.

నేను అడిగాను. "ఇవన్నీ సరేగాని భట్‌గారూ! నన్ను క్షమిస్తే నేనోమాట అడుగుతా చెప్పండి–మీరు. ఈ హోటల్ భోజనాన్ని అంతలా ఆనందంగా రసించి తింటారే– అది మీకంత బాగా నచ్చిందా?"

అమ్మయ్య – గుండెమీది బరువు తీసేసుకున్నాను. పక పక నవ్వాడు భట్. ఓనిముషం ఆగి చెప్పాడు.

"రావుగారూ! నచ్చడం, నచ్చకపోవడం అన్నది చాయిస్. ఒక లగ్జరీ–అది నాకు లేదు..."

ఇతనిలో పైకి కనపడని లోతులున్నట్లున్నాయి– అనుకున్నాను. "....ఏడేళ్ళనుండి నన్నొక భయంకరమైన కడుపునొప్పి బాధిస్తోంది. దానికి కారణం ఒక పెద్దవ్రణం... ఆపరేషన్ చేస్తేగాని అది పోదు. ఆ ఆపరేషన్‌కు నా గుండె బొత్తిగా తట్టుకోలేదుట.... కనుక ఇలా. ఇది ముదిరి ముదిరి నన్ను మింగక తప్పదు....మహా అయితే ఇంకో ఏడెనిమిదేళ్ళు బతుకుతానని ఇద్దరు ముగ్గురు స్పెషలిస్టులు చెప్పారు.... అందాక ఏడాక్టరు దగ్గరకు వెళ్ళినా ఏవో ఇన్ని మాత్రలిచ్చి మింగమంటారు. వాటివలన ఏమీ ప్రయోజనం వుండదు... ఆ కడుపునొప్పి వచ్చినపుడు నా యాతన వర్ణనాతీతం .. ఆ నొప్పి భరించలేక కిందపడి పొర్లుతుంటాను... ఆనొప్పి రాగానే మూడునాలుగు మాత్రలు వేసుకుని పడుకుంటాను. ఏ ఇరవై గంటలో ముప్ఫైగంటలో అయ్యాక లేస్తాను.... మళ్ళీ జన్మ ఎత్తినట్లుగా వుంటుంది. ఆ తర్వాత ఏ నాలుగు వారాలో అందరిలో ఒకడుగా తిరుగుతాను... ఇట్లా నా జీవితం ఒక చిన్న యుద్ధంలా అయిపోయింది.... ఇప్పుడు నాకు ముప్ఫై రెండేళ్ళు...ఇంకా ఎనిమిదేళ్ళు ఈ బాధ ఎటూ తప్పదు. చావు సరేసరి.... కనుక చింత ఎందుకు? భయందేనికి? దిగులు పడి లాభం ఏమిటి? ఉన్న ఈ కొన్ని సంవత్సరాలూ అన్నీ హాయిగా అనుభవించి

మాతమ్ముడికి ఆపరేషన్ చేయించి, మా చెల్లెలినొక ఇంటి దానిని చేసేసి పోతాను. రావ్‌సాబ్! అందుకనే జీవితంలో, ప్రతి దానినీ కూడా – ఆఖరికి ఈ హోటల్ కూటిని కూడా చాలా డెలిబరేట్‌గా ఎంజాయ్ చేస్తున్నాను. నాకున్న కొద్దికాలంలో దుఃఖానికీ, అయిష్టతకూ చోటులేదు. అది తెలుసుకునే కాబోలు నాకడుపు కూడా ఎక్కువ ఆకలితో అరుస్తుంది. మీరు చూచే వుంటారు– నేను మీ అందరి కన్న ఎక్కువగా తింటాను... తింటున్నది ఏదయినా పూర్తిగా అనుభవించి మరీ తింటాను... బహుశ నేనెప్పుడో, పూర్వజన్మల్లో ఒకదానిలో భీముడినో, బకాసురుడినో అయి వుంటాను– అవునా?" అని నవ్వాడు భట్.

ఇంత విషాదం దాచుకుని నవ్వుతున్నాడు ఈ మనిషి...

"లేక ....నాలా పొట్టిగా సన్నగా వున్నవాడు భీముడుగా వుండి వుండడంటారా?" అని భట్టు మళ్ళీనవ్వాడు.

ఆ రాత్రి నేను చాలసేపు నిద్రపోలేదు.

భట్టు! ఎంత చిత్రమైన మనిషి.... వెంకటాచలం మాట ఎంత నిజం! ఇతడినా నేను అసహ్యించుకున్నది. ... అతడి ధైర్యం, పరిస్థితుల కొక ప్రతిక్రియగా పరిణమించిన అతనిస్వభావం....!! అనంతభట్– అతడి పేరు.... అతడి బాధకూడా అనంతమేనా.... ఆ కడుపు నొప్పి– ఖచ్చితంగా ఇంకొన్నేళ్ళల్లో పోతాననడం – ఆ బాల్యం – ఆ ఇంగ్లీషు – ఆ ఆకలి – ఆ నవ్వు.... అనంతభట్ నిజంగా విలక్షణమైనవాడు....

తెల్లవారు ఝూమున ఎప్పుడు నిద్రపట్టిందో కాని, పొద్దున ఆరున్నరకు బాయ్ వచ్చి కాఫీ పెట్టి వెళ్ళడం కూడా తెలియదు. ఆ కాఫీ కాస్తా చల్లారి ఈగలు ముసురుతుండగా ఎనిమిదిన్నరకు లేచాను. హడావిడిగా ఆఫీసుకు పరుగెత్తాను.

ఆ తర్వాత వారంలో ఒక రోజు రోజంతా భట్ కనిపించలేదు... రాత్రి పది ప్రాంతంలో స్నానాల గదివైపు వెళ్తుంటే ఎదురయ్యాడు– "నిన్న రాత్రినుండి కనపడలేదే.... ఎక్కడకయినా వెళ్ళారా?" అని అడిగాను.

నవ్వాడు. నీరసంగా వున్నట్లన్పించింది "టూర్ వెళ్ళొచ్చాను పైలోకాలకు–" అన్నాడు.

గతుక్కుమన్నాను. ఈ మాత్రం ఊహించలేకపోయానే అనిపించింది. అర్థంలేని నవ్వొకటి నవ్వి గబగబ వెళ్ళిపోయాను.

అటుపిమ్మట భట్, వెంకటాచలం, నేను కలిసి చాల ఇంగ్లీషు సినిమాలు చూశాము. భట్‌చేత ఏవో కొన్ని ఇంగ్లీషు పుస్తకాలు కొనిపించాను. చిత్రప్రదర్శనా లంటే భట్ చెవి కోసుకునేవాడు కాదు. కాని వెంకటాచలంతో ఆధునిక చిత్రకళమీద వేడివేడిగా చర్చించేవాడు....మా ఆవిడ హైదరాబాద్ నుండి బయిలుదేరుతున్నానని రాసింది. ఇల్లు వెతకడం మొదలెట్టాను. వెంకటాచలం పనిమీద నెలరోజులపాటు మద్రాసు వెళ్ళాడు... ఒకరోజు సాయంకాలం గది చేరాను.

పది నిముషాల తర్వాత భట్ ఈలవేసుకుంటూ వచ్చాడు.

"రావ్ గారూ! ఇవాళ చాల సంతోషంగా వుంది."

"ఏం కథ?"

"నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వేశాను." అన్నాడు భట్ పరమానందంతో–

ఇదేమి విడ్డూరం– నెలకు వేయిరూపాయలు కాక పైరాబడి వచ్చే ఉద్యోగాన్ని చేజేతుల వదిలేసుకుని ఆనందం ప్రకటిస్తున్నాడు! ఇతడికి పిచ్చా చాదస్తమా–

ఆ మాటే అడిగాను కాస్త మర్యాదగా

"దాన్దేముందిలెండి.... రేపు సాయంకాలం కలకత్తా వెళ్తున్నాను. అక్కడ ఏదో ఒక ఉద్యోగం సంపాదిస్తాను. దేశంలో ఎక్కడయినా ఈ వేయి రూపాయలు తెచ్చుకోగలను.... ఇలాటి ఉద్యోగాలలో చేరడం, వదిలేయడం ఇది పన్నెండవసారో పది హేనవసారో.... చెబుతే నమ్మరుగాని నేను గౌహతిలో రెండేళ్ళపాటు రెండు టాక్సీలు కొనినడిపాను. ఒకనాడుదయం ఉన్నట్లుండి అన్ని వదిలేసి కట్టు బట్టలతో ఢిల్లీ వచ్చిచేరాను– తెలుసా?"

మైగాడ్ ! ఇదేం మనిషి.....

ఆ రాత్రి పదినుండి మరుసటి ఉదయం నాలుగున్నరదాక– ఆ డాబా మీద, అనంతాకాశం కిందకూర్చుని, అనంతభట్ తనజీవితంలోని ఆ గౌహతి అధ్యాయం చెబుతుంటే విన్నాను. అదొక మరపురాని అనుభవం, అతడొక మరపురాని వ్యక్తి.

మరుసటి రోజుదయం తొమ్మిదింటికి ఆఫీసుకు బయలు దేరుతుండగా భట్ సెలవుతీసుకున్నాడు. ఆల్ ఫ్రెడ్ హిచ్ కాక్ ఎన్నిక చేసిన కథలున్న సంకలనం ఇచ్చి నానుండి మామ్ సంపుటి అడిగితీసుకున్నాడు. నా ఆఫీసు అడ్రసు రాసుకున్నాడు.

ఆ తర్వాత రెండు వారాలకు నాకో ఇల్లుకుదిరింది. హైదారాబాద్ వెళ్ళి మా ఆవిడను పిల్లలను తీసుకువచ్చాను.

జీవితంలోకి పడ్డాను.

వెంకటాచలమూ ఇల్లు కుదుర్చుకుని ఇల్లాలిని తెచ్చుకున్నాడు.

మూడు నెలలయ్యాక ఒకనాడుత్తరం వచ్చింది భట్ నుండి.

మంగుళూర్ నుండి రాశాడు. కలకత్తాలో ఒక ముద్రణ పరికరాల కంపెనీలో సేల్స్‌మన్‌గా చేరాట్ట దేశమంతా తిరుగుతున్నాట్ట.... తనయాత్రలో దక్షణదేశం వచ్చిన సందర్భంగా తల్లితండ్రులను చూడాలని మంగుళూర్ వచ్చాడట.

–"దారిలో మైసూర్‌లో నాకు పెళ్ళయింది రావ్‌సాబ్! – పిల్ల అందమయిందే కాని పెళ్ళి శాశ్వతమయిందికాదు.... ఒక్క రాత్రికన్నా ఎక్కువ నిలబడలేదు..." ఔరా భట్టూ...!!

"త్వరలోనే ఢిల్లీవస్తాను...." అని రాశాడు.

కాని రాలేదు. రెండుమూడుత్తరాలు వచ్చాయి– జయపూర్ నుండి ఒకటి. రాంచినుండి ఇంకొకటీ– జవాబులు అతడి కలకత్తా అడ్రసుకు రాశాను.. క్రమంగా ఆ ధార ఇంకిపోయింది. నాలుగేళ్ళు గడిచాయి.

మా పెద్దబ్బాయిని బడిలో చేర్చాము. చంటిది నేనూ వెళ్తాననేంతదయింది. వెంకటాచలం తన చిత్రాల ప్రదర్శన ఏర్పాటుచేశాడు.

ఒక రోజు

శ్రీ చక్రాంకితుడయిన శ్రీ వైష్ణవుడివలె-

ఎన్నో తపాలా ముద్రలు వేసుకొన్న ఒక కవర్ -నన్ను చేరింది. దాని మీద అడ్రసులో "న్యూ ఢిల్లీ" అన్నచోట నీరుపడి సిరా పూర్తిగా చెరిగిపోయింది.... ఆఖరి అక్షరం "ఐ" మాత్రం వుంది. ఆ వుత్తరం రాంచి, వారణాసి, జల్పాయ్‌గురి- ఈ విధంగా "ఐ" అన్న ఆఖరి అక్షరం వున్న పేర్లుగల వూళ్ళు తిరిగి తిరిగి, ముద్రలతో బరువెక్కి ఎక్కి, వెక్కి వెక్కి ఏడిచి చివరకెల్లాగో న్యూ ఢిల్లీ చేరి నన్ను చేరింది!

"రావు గారూ!

చాల రోజులయింది మీకు రాసి..... మీ అడ్రసున్న డైరీ ఎక్కడో పోయింది... ఇటీవల మంగుళూర్ వెళ్ళితే అక్కడ హఠాత్తుగా దొరికింది. ఇదుగో రాస్తున్నాను. ఈ అడ్రసు మారలేదని ఆశిస్తున్నాను.

మీ పాపాయిలు కులాసేనా?

మా అమ్మానాన్న బాగున్నారు. మా తమ్ముడికి వేలూర్‌లో ఆపరేషన్ జరిగింది. వాడికిక భయంలేదు. ఆల్వేయ్‌లో ఉద్యోగంలో చేరాడు. మా చెల్లెలికి సంబంధం కుదిరింది. అబ్బాయి మెడికల్ రెప్రజెంటేటివ్- ఇంకా ముహూర్తం నిశ్చయం కాలేదు.

అన్నిటికన్న వింత ఏమిటంటే- గత సంవత్సరం టూర్ మీద బొంబాయి వెళ్ళాను. నెల రోజులుండ వలసి వచ్చింది. ఒక రోజు విపరీతంగా కడుపునొప్పి వచ్చింది. ఆస్పత్రిలో చేర్చారు. విదేశాలనుండి వచ్చిన నిపుణుడొకాయన 'ఎమర్జెన్సీ ఆపరేషన్' చేశారు. నాలుగు వారాలు పడకమీదే వున్నాను.

నా ప్రియమైన కడుపునొప్పి నాకు శాశ్వతంగా దూరమయిపోయింది. ఈ ఏడాదిలో ఒకసారన్నా నన్ను పలకరించలేదు.... ఎంత కృతఘ్నుతో చూడండి-

నా కడుపునొప్పయితే పోయింది. బట్ రావుజీ! ఆ మునుపటి ఆకలికూడా పోయిందండీ.... పట్టుమని నాలుగు ముద్దల అన్నం తినలేకపోతున్నాను...." అంటూ ఇంకా ఏదో రాశాడు.

కింద సంతకం వుంది

-బి-హెచ్-ఎ-టి....

(స్వాతి '65)